బ్రాహ్మణుల హక్కుల సాధనకు కృషి


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

నాగోలు: రాష్ట్రంలోని అన్ని బ్రాహ్మణ సంఘాల సమన్వయ కర్తగా ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి చెందిన బసవరాజు శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం నాగోలు బండ్లగూడలో నిర్వహించిన బ్రాహ్మణ సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బసవరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమాజంలో బ్రాహ్మణులపై జరుగుతున్న దాడుల నిర్మూలనకు సమన్వయ కమిటీ ద్వారా ముందుకు వెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో దర్శనం శర్మ, ప్రమోద్ కొఠారి, మునిపల్లె శ్రీనివాస్, వెన్నంపల్లి జగన్ మోహన్ శర్మ, మోత్కూరు రాము, జోషి గోపాల్ శర్మ, నందిరాజు లక్ష్మీనారాయణ, వైష్ణవి ప్రసాద్, గోపి కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

నియామకం


పవన్‌కళ్యాణ్

చంపాపేట: తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం (టీపీయూఎస్) ప్రైవేట్ ఉపాధ్యాయ విభాగ బాలాపూర్ అధ్యక్షుడిగా చంపాపేటకు చెందిన ఎస్ పవన్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ కార్తీక్ ఉత్తర్వులను జారీ చేసి బుధవారం చంపాపేటలో జరిగిన సమావేశంలో పవన్ కళ్యాణ్‌కు అందజేశారు.

లండన్ కిడ్స్ స్కూల్ ప్రారంభం


స్కూల్ ప్రారంభోత్సవంలో నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: హయత్‌నగర్ పరిధి ఏల్లారెడ్డి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన లండన్ కిడ్స్ యూకే కాన్సెప్ట్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను బుధవారం కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బొమ్మలగుడి ప్రాంతంలో ఆధునిక వసతులతో కిడ్స్ స్కూల్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం భార్గవి, కాలనీవాసులు మాధవరెడ్డి, లక్ష్మారెడ్డి, నజీమ్‌ఉద్దీన్, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ ప్రాంగణంలోని గణపతి ఆలయంలో సంకష్టహర చతుర్థి సందర్భంగా బుధవారం సామూహిక గణపతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ లావణ్య, అర్చకులు చంద్రకాంత్ శర్మ, సంతోష్‌కుమార్, శ్రీనివాస్ సిబ్బంది వెంకటయ్య పాల్గొన్నారు.

‘రన్‌ఫర్ జీసస్’కు తరలిరావాలి


మాణిక్యం అబ్రాహం

మలక్‌పేట: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 19న నిర్వహించనున్న రన్‌ఫర్ జీసస్ దిగ్విజయం చేయడానికి క్రైస్తవ సమాజమంతా కదలి రావాలని తెలంగాణ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల మాణిక్యం అబ్రాహం పిలుపునిచ్చారు. అన్ని జిల్లా, మండల కేంద్రాలలో రన్‌ఫర్ జీసస్ ర్యాలీకి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. యేసుక్రీస్తు చూపిన ప్రేమ, శాంతియుత మార్గం అనుసరించే క్రైస్తవులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలు పట్టించుకోవాలన్నారు. ర్యాలీ ద్వారా క్రైస్తవుల యూనిటీ చాటిచెప్పాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు

బడంగ్‌పేట్: ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్‌ను.. బీసీసెల్ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు ఈశ్వరోజు బాలేష్‌చారి బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నిబంధనలు పాటిద్దాం.. | అగ్నిప్రమాదాలు నివారిద్దాం

ప్రమాదం జరిగిన వెంటనే 101 నంబర్‌కు సమాచారం ఇవ్వండి సాక్షితో మలక్‌పేట ఫైర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ అంజిరెడ్డి



మలక్‌పేట: నిబంధనలు పాటించి అగ్నిప్రమాదాలను అరికడదామని మలక్‌పేట ఫైర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ అంజిరెడ్డి కోరారు. వేసవిలో అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులపై బుధవారం ఆయన ‘సాక్షి’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101 లేదా 040–23449213, 87126 99414 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

సాక్షి: అగ్నిమాపక వారోత్సవాల్లో ఏ విధంగా అవగాహన కల్పిస్తున్నారు?

అధికారి: ఈ నెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. ప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చర్యల గురించి ప్రచారం చేస్తూ, మాక్ డ్రిల్ ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయడమే వారోత్సవాల ఉద్దేశం.

సాక్షి: ఇళ్లలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

అధికారి: ఇంటిలోని వస్తువులను అల్మారాలు, సెల్ఫ్‌లలో సక్రమంగా ఉంచాలి. ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలి. చిన్నపిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాసులు ఇతర మండే పదార్థాలు అందుబాటులో ఉండకుండా చూడాలి. ఐఎస్ఐ ఎలక్ట్రికల్ వైరింగ్ పరికరాలనే ఉపయోగించాలి. ఎలక్ట్రికల్ సాకెట్‌లో దాని సమార్థ్యానికి తగిన ప్లగ్‌ను మాత్రమే వాడాలి. ఇంటి నుంచి ఎక్కువ రోజులు బయటికి వెళ్లినప్పుడు మెయిన్ ఆఫ్ చేయడం మంచిది.

సాక్షి: వంటింటిలో అనుసరించాల్సిన పద్ధతుల గురించి..

అధికారి: వంటింటి కింది, పై భాగాల్లో గాలి, వెలుతురు ఉండేటట్లు చూసుకోవాలి. చెడిపోయిన గ్యాస్ ట్యూబ్‌ను ఐఎస్ఐ మార్కు గల కొత్త ట్యూబ్‌తో వెంటనే మార్చాలి. ఎల్‌పీజీ వాడకం పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ వాల్వ్ ఆపేయాలి. వంట గదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్ అదనపు గ్యాస్ సిలిండర్ వంటివి పెట్టరాదు.

సాక్షి: స్కూల్స్, హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్‌లలో ఏలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

అధికారి: స్కూల్స్, హాస్పిటల్, షాపింగ్ మాల్స్‌లో ఫైర్ అలారం, ఫైర్‌స్మోక్ డిటెక్టర్లను అవసరమైన ప్రదేశాలలో ఏర్పాటు చేయాలి. సెల్లార్‌లలో ఆటోమేటిక్ స్ప్రింక్లర్స్‌ను ఉపయోగించాలి. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు క్షేమంగా బయటకు వచ్చేలా మ్యాప్‌లను ప్రదర్శించాలి. బయటికి వెళ్లే మార్గాలలో(మెట్లు, తలుపుల వద్ద) ఎలాంటి ఆటంకాలు లేకుండా చూసుకోవాలి.

సాక్షి: అగ్నిప్రమాదాల సమయంలో పౌరులకు మీరిచ్చే సందేశం ఏంటి?

అధికారి: విద్యుత్ ప్రమాదాలపై నీటిని ఉపయోగించరాదు. పొడి ఇసుకను మాత్రమే వాడాలి. ఎలక్ట్రికల్ ఫైర్ జరిగినప్పుడు మొదట మెయిన్ స్విచ్ ఆఫ్ చేసిన సంబంధిత ఫైర్‌ను అర్పడానికి ప్రయత్నం చేయాలి. విద్యుత్ ప్రవహిస్తున్న తీగలపై అత్యవసర పరిస్థితులలో కార్బన్ డై ఆక్సైడ్‌ను ఉపయోగించాలి. అగ్నిప్రమాద సిబ్బందికి సహకరించాలి.

పార్టీ కోసం కష్టపడే వారిని ప్రోత్సహిస్తాం


మాట్లాడుతున్న మధుయాష్కిగౌడ్

మన్సూరాబాద్: పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలను ప్రోత్సహిస్తామని, నామినేటెడ్ పదవుల్లో వారికి తగిన ప్రాధాన్యం ఉంటుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ అన్నారు. హయత్‌నగర్‌లోని టీ–నగర్‌కాలనీలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నా కుటుంబ సభ్యులు ఎవరూ రాజకీయాల్లో లేరని, కార్యకర్తలే నా రాజకీయ వారసులన్నారు. పార్టీని బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. సోషల్ మీడియాలో ప్రతిపక్ష పార్టీల నేతలు చేస్తున్న విమర్శలపై కార్యకర్తలు, నాయకులు దీటుగా స్పందించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఆయన అనుచరులు చేస్తున్న అక్రమాలు, ఆరోపణలను తిప్పి కొట్టాలని సూచించారు. నేషనల్ హెరాల్డ్ విషయంలో రాహుల్, సోనియాగాంధీపై అక్రమ కేసులు నమోదు చేసిన తీరుపై ఈడీ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో ఎల్‌బీనగర్ నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మిద్దేల జితేందర్, యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, కార్పొరేటర్లు దర్పెల్లి రాజశేఖర్‌రెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, సుజాతానాయక్, నాయకులు ముద్దగౌని రాంమ్మోహన్‌గౌడ్, గజ్జి భాస్కర్‌యాదవ్, వజీర్ ప్రకాష్‌గౌడ్, పన్యాల జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు

టమాటా రూ.15, వంకాయ రూ.18, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.19, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.17, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.35, మునగ రూ.23, కందగడ్డ రూ.85, బీట్‌రూట్ రూ.17, కీర రూ.23, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.38. ఈ ధరలు గురువారం ఉదయం 9 వరకు వర్తిస్తాయి.

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

దిల్‌సుఖ్‌నగర్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి తమలపాకుల హర్షలత పేర్కొన్నారు. బుధవారం ఆమె ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో సగం జనాభా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే ఉందని రంగారెడ్డి జిల్లా నుంచి సీనియర్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలన్నారు.

ప్రియదర్శిని పార్కు ఎదుట బ్రిడ్జి నిర్మాణం


బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

లింగోజిగూడ: ట్రాఫిక్ సమస్య నుంచి విముక్తి పొందేందుకు ప్రియదర్శిని పార్కు ఎదుట నుంచి బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు లింగోజిగూడ కార్పొరేటర్ దర్పెల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. రూ.5.95కోట్ల వ్యయంతో చేపట్టనున్న బ్రిడ్జి నిర్మాణ పనులను బుధవారం జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ శివకుమార్‌నాయుడు, ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్రిడ్జి నిర్మాణ సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. బ్రిడ్జి పూర్తయితే లింగోజిగూడ ప్రాంతవాసులకు, సరూర్‌నగర్ నుంచి వచ్చే వారికి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మెయింటనెన్స్ సీఈ రత్నాకర్‌రావు, ఎస్ఎన్‌డీపీ కోటేశ్వర్‌రావు, ఇరిగేషన్ ఈఈ నారాయణ, రవిశంకర్, డీఈ కార్తీక్, వెంకటకిరణ్, సేవాలాల్, రవిచంద్, యాదగిరి, నాయకులు శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, ప్రేమ్‌నాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆమె సైదాబాద్‌లోని మాధవనగర్ కాలనీలో పర్యటించి నూతనంగా ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైపులైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మాధవనగర్ కాలనీ సహా వాటర్ పైపులైన్ నిర్మాణ పనులు ముగిసిన తర్వాత ఆయా ప్రాంతాల్లో సీసీరోడ్ల నిర్మాణాలు చేపడుతామన్నారు.

‘యాదవులపై ప్రభుత్వం కక్ష’


మాట్లాడుతున్న నిరంజన్‌యాదవ్

చంచల్‌గూడ: సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం యాదవులు నిర్వహించే బర్ల దొడ్లు, డైరీ ఫాంలపై కక్షపూరితంగా వ్యవరిస్తుందని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన కుర్మగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నడూ లేని విధంగా జీహెచ్ఎంసీ బర్ల దొడ్లను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ప్రజలకు స్వచ్ఛమైన డైరీ ఉత్పత్తులు అందజేస్తుండగా దొడ్లను తొలగించాలని జీహెచ్ఎంసీ నోటీసులు జారీ చేయడం దుర్మార్గమన్నారు. దొడ్లను తొలగించాలని ప్రయత్నిస్తే జంటనగరాల వ్యాప్తంగా నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. పాతబస్తీలో ముస్లింలు నిర్వహిస్తున్న డైరీఫాంలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరమన్నారు. ప్రజల ప్రాణాలకు హాని కలిగించే మద్యం దుకాణాలు ప్రతి వీధిలో నిర్వహిస్తున్న ప్రభుత్వం, డైరీలపై చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కామటి మహేష్ తదితరులున్నారు.

ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి



చాదర్‌ఘాట్: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు గుర్తు తెలియని ఓ వ్యక్తులు మృతిచెందిన ఘటన చాదర్‌ఘాట్, వనస్థలిపురం పోలీస్ స్టేషన్ల పరిధుల్లో చోటు చేసుకున్నాయి. పోలీసుల వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం మలక్‌పేట మార్కెట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెంది ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.



హస్తినాపురం: వనస్థలిపురం ప్రభుత్వ ఆస్పత్రి పక్కన ఓ వ్యక్తి స్పృహకోల్పోయి పడిపోయాడు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

శ్మశానవాటికలో మరిన్ని వసతులు కల్పించండి

కాచిగూడ: హిందూ శ్మశానవాటికలో మరిన్ని మెరుగైన వసతులను కల్పించే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని హిందూ శ్మశానవాటిక ట్రస్ట్‌బోర్డు అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ కోరారు. బుధవారం కాచిగూడ హర్రస్‌పెంటలోని హిందూ శ్మశానవాటిక ప్రాంగణంలోని ఆలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్మశానవాటిక అభివృద్ధి విషయంలో జీహెచ్ఎంసీ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నగరంలోని 292 శ్మశానవాటికల్లో అతిపెద్దదైన కాచిగూడ హిందూ శ్మశానవాటిక అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. శ్మశానవాటికను అనుకొని ఉన్న మూసీ మొత్తం చెత్తాచెదారంతో నిండి దుర్వాసన వస్తోందన్నారు. శ్మశానవాటికలో మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సహకారంతో నిర్మించినట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్ విగ్, సాయిగిరిధర్, సి.నందకిషోర్ యాదవ్, రతన్ విద్యాసాగర్, విజయ్ కుమార్, కృష్ణాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురంలో ‘గావ్‌చలో–బస్తీచలో’


కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

వనస్థలిపురం: గావ్‌చలో–బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా బీజేపీ వనస్థలిపురం డివిజన్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం వనస్థలిపురంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. మహంకాళి దేవాలయం శుద్ధి, అయోధ్య కర సేవకులు దామోదర్‌రెడ్డికి సత్కారం, కేంద్ర ప్రభుత్వ ముద్ర లోన్ పథకం ద్వారా రాజేశ్వరి ఏర్పాటు చేసిన ఆర్‌కే సారీ కలెక్షన్ సందర్శన, బీజేపీ జేష్ఠ కార్యకర్త నరసింహచారికి సత్కారం, కాపు సంఘం నాయకులు జవహర్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా (అర్బన్) అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కళ్లెం రవిందర్‌రెడ్డి, నాయకులు సామ రంగారెడ్డి, కొత్త రవిందర్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, నీళ్ల అంజన్ కుమార్‌గౌడ్, నూతి శ్రీనివాస్, తడకమళ్ల విజయ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, నరసింహారావు, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహచారి, అరుణ్‌జోగి, రాజు పాల్గొన్నారు.

దళితరత్న అవార్డుల ప్రదానం


బ్యాగరి అనంతయ్య, చిట్టుపాక అశోక్, ముత్యాలును సత్కరిస్తున్న మేడి పాపన్నమాదిగ

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గానికి చెందిన దళిత సంఘాల నాయకులకు దళితరత్న అవార్డులు దక్కాయి. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన కార్మిక నాయకుడు, దళితనేత బ్యాగరి అనంతయ్య, మూసారంబాగ్‌కు చెందిన చిట్టుపాక అశోక్, పోలేపాక వెంకన్న, కొయ్యాడ వెంకటస్వామి అవార్డులు అందుకున్నారు. రవీంద్రభారతిలో జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ,జయంతి ఉత్సవాల్లో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మేడి పాపన్న వారికి మెమోంటో అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇటుక రాజు, రాంచందర్, గంట సుదర్శన్ పాల్గొన్నారు.

నాగోలు: ఎల్‌బీనగర్‌కు చెందిన దళిత నేత జిల్లా ముత్యాలుకు దళితరత్న అవార్డు వరించింది. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు దళితుల హక్కుల కోసం చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్ రాజు మాదిగ, ఎస్సీ ఉప కులాల చైర్మన్ మేడి పాపయ్య మాదిగ నగరంలోని జరిగిన కార్యక్రమంలో జిల్లా ముత్యాలుకు అవార్డు అందజేశారు.

శానిటేషన్ సూపర్‌వైజర్ లేక ఇబ్బందులు

చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గంలో శానిటేషన్ సూపర్‌వైజర్ అధికారి లేక శుభ్రతలో వెనకబడుతోంది. గతంలో పనిచేసిన ఎస్ఎస్‌పై ఆరోపణలు రావడంతో దాదాపు ఆరు నెలల నుంచి పోస్ట్ ఖాళీగా ఉంది. సర్కిల్–6లో ఏఎంహెచ్ఓ అధికారితో పాటు 7 డివిజన్లకు 7 జవాన్లు, ఎస్ఎఫ్ఏ (శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్) 38 మంది అదే విధంగా స్వీపర్లు 60, పారిశుద్ధ్య కార్మికులు 749 మంది శానిటేషన్ పనులు నిర్వహిస్తున్నారు. అదనంగా ఏఎంహెచ్ఓకు ట్రేడ్ లైసెన్సులతో పాటు బర్త్ డెత్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్స్ కూడా చేయాల్సి ఉంటుంది. జవాన్లు, ఎస్ఎఫ్ఏలు, స్వీపర్లు, పారిశుద్ధ్య కార్మికులపై మానిటరింగ్ చేయాల్సిన ఎస్ఎస్ లేకపోవటంతో కొంత మేర ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు తెలిపారు. వెంటనే డీసీ, జెడ్సీ స్పందించి శానిటేషన్ సూపర్‌వైజర్‌ను నియమించాలని కోరుతున్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే ఎస్ఎస్ అధికారిని నియమిస్తామని డీసీ జయంత్ తెలిపారు. గతంలో పని చేసిన ఎస్ఎస్‌పై ఫిర్యాదులు రావడంతో మాతృసంస్థకు వెళ్లారని అదనంగా ఏఎంహెచ్ఓకు బాధ్యతలు ఇచ్చామన్నారు.

అసంపూర్తి పనులు.. అవస్థల్లో ప్రజలు


స్లాబ్ వరకు నిర్మించిన కమ్యూనిటీహాల్

మలక్‌పేట: అసంపూర్తి అభివృద్ధి పనులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పనులు ప్రారంభించి నెలల గడుస్తున్నా పూర్తి చేసిన దఖాలాలు కన్పించడం లేదు. మూసారంబాగ్ డివిజన్ దిల్‌సుఖ్‌నగర్ గాంధీనగర్ పార్కులో సౌకర్యాల కల్పనకు అధికారులు రూ.18 లక్షల నిధులు కేటాయించారు. కమ్యూనిటీహాల్, బోర్‌వెల్, వాకింగ్ పాత్, గ్రీనరీ ఏర్పాటు కోసం 2024లో కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి శంకుస్థాపన సైతం చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి కమ్యూనిటీహాల్ స్లాబ్ వరకు నిర్మించాడు. అప్పటి నుంచి మిగతా పనులు ముందుకు సాగటం లేదు. 5 నెలలు దాటిన పనులపై దృష్టి పెట్టడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కార్పొరేటర్‌ను వివరణ కోరగా నిధులేమితోనే పనులు ఆలస్యం అవుతున్నాయని, ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపించామని నిధులు రాగానే మిగిలిన పనులు పూర్తి చేయిస్తామని వెల్లడించారు.

ఈ నీటిని తాగేదెలా.?

- నల్లకుంట డివిజన్‌లో కొన్ని నెలలుగా కలుషిత నీటి సరఫరా
- సమస్యకు గల కారణాలను గుర్తించలేకపోతున్న అధికారులు


తిలక్‌నగర్ గాంధీ బొమ్మ వీధిలో సరఫరా అవుతున్న కలుషిత నీరు

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని తిలక్‌నగర్ గాంధీ బొమ్మ నుంచి బతుకమ్మ కుంట మెయిన్ రోడ్డుకు వెళ్లే చిన్న వీధిలో కొన్ని నెలలుగా కలుషిత నీరు సరఫరా అవుతోంది. మొదటి గంట కలుషిత నీరు సరఫరా అవుతోందని ఆ తర్వాత కాస్త శుభ్రమైన నీరు సరఫరా అవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ నీటిని ఇంటి అవసరాలకు వాడుకుంటున్నామని తెలిపారు. తాగడానికి మాత్రం బయట నుంచి నీళ్ల క్యాన్లు కొనుక్కుంటున్నామని చెబుతున్నారు. కొందరు ఈ నల్లా నీటిని తాగడం వల్ల రోగాల బారిన పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయమై పలుమార్లు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. జలమండలి అధికారులు కలుషిత నీటి సరఫరాకు గల కారణాలు గుర్తించలేక పోతున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కలుషిత నీటి సరఫరా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బస్తీవాసులు కోరుతున్నారు.

ఆర్‌యూవీ పథకానికి 3840 దరఖాస్తులు


అంబర్‌పేట వార్డు కార్యాలయం

అంబర్‌పేట: రాజీవ్ యువ వికాసం(ఆర్‌యూవీ) పథకానికి అనూహ్య స్పందన వచ్చింది. అంబర్‌పేట నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, మైనార్టీలు పెద్ద ఎత్తున రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. చివరి గడువు ఈ నెల 14తో ముగిసింది. నియోజకవర్గంలో ఉన్న ఐదు డివిజన్ల వారీగా దరఖాస్తులను తీసుకున్నారు. మొత్తం 3840 దరఖాస్తులు వచ్చాయి.

డివిజన్ల వారీగా వచ్చిన దరఖాస్తులు...

కాచిగూడ	221
నల్లకుంట	459
గోల్నాక	772
అంబర్‌పేట	1489
బాగ్‌అంబర్‌పేట	611